
సాక్షి
వరంగల్
బుధవారం | 26 | జూన్ | 2024



డీన్ అపాయింట్ డిలే!
కేయూ సైన్స్ డీన్ నియామకంలో యూనివర్సిటీ అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో యూనివర్సిటీలోని ప్రొఫెసర్లలో చర్చనీయాంశంగా మారింది. - 8లో▸



అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు
అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి గర్భస్రావాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు ఏసీపీ వివరాలు వెల్లడించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33^0 /26^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కొత్తూరు ప్రభుత్వ పాఠశాలకు అభినందన



రాయపర్తి: రాయపర్తి మండలంలోని కొత్తూరు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం, ఇన్‌చార్జ్ ఎంఈఓ నోముల రంగయ్య, పాఠశాల యాజమాన్యాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అభినందించారు. పొల్యూషన్ బోర్డు ఆధ్వర్యంలో అందించే గ్రీన్ చాంపియన్ స్టేట్ ఫస్ట్ అవార్డును జూన్ 5న అందుకున్నందుకు అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



నర్సంపేట/నర్సంపేట రూరల్: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జూలై 6, 7 తేదీల్లో నిర్వహించే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి అణగారిన వర్గాల విద్యార్థులకు విద్యను అందకుండా చేసిందని ఆరోపించారు. కాలం చెల్లిన మనువాద ఆలోచన విధానాలను ప్రశ్నించాల్సిన అవసరం వాటికి వ్యతిరేకంగా పోరాడాల్సిన ప్రధాన బాధ్యత నేడు ప్రగతిశీల విద్యార్థులపై మరింత ఉందన్నారు. విద్యార్థులు, మేధావులు రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌కు వందలాదిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు అజిత్, శ్యామ్, కల్యాణ్, శ్రావణ్, రవి, అనూష, రఘు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల బస్‌పాస్ గడువు పొడిగింపు

కాజీపేట సెంటర్: రాష్ట్రంలోని అక్రిడేటెడ్ జర్నలిస్టుల రాయితీ బస్ పాసుల గడువును తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) పొడిగించింది. ప్రస్తుత బస్ పాస్‌ల గడువు ఈ నెల 30తో ముగుస్తుండగా తాజాగా సెప్టెంబర్ 30 వరకు (మూడు నెలల పాటు) జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని పొడిగిస్తూ తెలంగాణ సమాచార, పౌర సంబంధాల శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని వరంగల్ జిల్లా పౌర సంబంధాల అధికారి అయూబ్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. అక్రిడేటెడ్ జర్నలిస్టుల రాయితీ బస్ పాసుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా, కాలపరిమితి పొడిగించిన ఈ బస్ పాస్‌లను గతంలో మాదిరిగానే https://tgsrtcpass. com/journalist. do?category=Fresh వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులో జర్నలిస్టుల వ్యక్తిగత వివరాలను నమోదు చేయడంతోపాటు ఫొటో, అక్రిడిటేషన్ కార్డులను విధిగా అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. బస్ పాస్ కలెక్షన్ సెంటర్‌ను ఎంపిక చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల ను సమాచార, పౌరసంబంధాల శాఖ ఆన్‌లైన్‌లో ధృవీకరించిన తర్వాత జర్నలిస్టులకు బస్ పాస్‌లను టీజీఎస్‌ఆర్టీసీ జారీ చేస్తుందని తెలిపారు.

కాళోజీ కళాక్షేత్రం పనుల్లో వేగం పెంచండి



హన్మకొండ: కాళోజీ కళాక్షేత్రం పనుల్లో వేగం పెంచాలని 'కుడా' వైస్ చైర్‌పర్సన్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలో నిర్మాణంలో ఉన్న కాళోజీ కళాక్షేత్రం పనుల్ని పరిశీలించారు. దీంతోపాటు ఇన్నర్ రింగ్ రోడ్డు పనుల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయని, మిగతా ఫినిషింగ్ పనులు ఆగస్టు 31లోగా పూర్తి చేయాలని సూచించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు ఇప్పటికీ 70 శాతం పూర్తయ్యాయని, వివాదంలో ఉన్న స్థలాలను త్వరగా పరిష్కరించి మిగతా పనులు, ప్యాచ్ వర్క్ పనుల్ని నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో 'కుడా' సీపీఓ అజిత్‌రెడ్డి ఈఈ భీం రావ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవళిక కుటుంబానికి భరోసా ఏదీ..?

నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ అందరి నోట్లో ఇదే పేరు

- దుగ్గొండి మండలం బిక్కాజిపేటకు ప్రముఖుల రాక
- ప్రియాంకగాంధీ దూతగా వచ్చిన అప్పటి యూపీ ఎంపీ డాలీశర్మ
- మీకు అండగా ఉంటామంటూ మా నేత పంపారని సందేశం
- ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పుడు భావోద్వేగ ట్వీట్
- కుటుంబానికి న్యాయం చేయాలంటూ ప్రవళిక తల్లిదండ్రుల వేడుకోలు
- కూలీ పనులకు వెళ్తూ జీవనం వెళ్లదీస్తూ కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం



ప్రవళిక కుటుంబాన్ని ఓదారుస్తున్న ఉత్తరప్రదేశ్ ఎంపీ డాలీశర్మ(ఫైల్)



ప్రవళిక చిత్రపటం పట్టుకొని ఆదుకోవాలంటున్న తల్లిదండ్రులు

సాక్షి, వరంగల్/దుగ్గొండి: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ మర్రి ప్రవళిక ఆత్మహత్య రాష్ట్రాన్నే కాదు దేశంలోనే సంచలనంగా మారింది. ప్రధాని మోదీ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతోపాటు తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి,బీజేపీ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌ల నోటి వెంట రాజకీయ ఎన్నికల ప్రచారంలో ఆమె పేరు మార్మోగింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రూప్ పరీక్షల విధానంలో ఆలసత్వం వల్లే ఆమె ఆత్మహత్య చేసుకుందని, నిరుద్యోగులు ఎవరూ అధైర్యపడొద్దని తమ ప్రభుత్వాలు రాగానే ఠంచన్‌గా పరీక్షలు నిర్వహిస్తామని యువతను ఆకట్టుకుంది. అదే సమయంలో ప్రవళిక కుటుంబాన్ని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అదుకోవాలని,ఆమె కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించడంతోపాటు ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశాయి. అదే సమయంలో రాబోయే తమ ప్రభుత్వం ద్వారా ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని బాహటంగానే ప్రకటించాయి. అలా వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బిక్కాజీపేటకు చెందిన ప్రవళిక పేరును వాడుకొని ఆయా పార్టీలు మద్దతు కూడగట్టుకున్నాయి. ఇక్కడివరకు బాగానే ఉన్నా అప్పటి వరకు ప్రతిపక్షంలో ఉండి ప్రవళిక కుటుంబాన్ని ఆదుకోవాలన్న కాంగ్రెస్, బీజేపీ నేతలు కనీసం ఇప్పుడు ఆ కుటుంబంవైపు చూడకపోవడంతో కన్నీరుమున్నీరవుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల వద్దకు కాళ్లు అరిగేలా తిరిగిన ప్రవళిక తండ్రి విసిగివేసారి కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 28న ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి వరంగల్‌కు రానున్న సందర్భంలో తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ప్రియాంక గాంధీ దూత వచ్చినా..

అసెంబ్లీ ఎన్నికలకు కేవలం 45 రోజుల గడువు ఉండగా ప్రవళిక మృతిని అప్పటి ప్రతిపక్షం, నేటి అధికార పక్షం కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీలు అనుకూలంగా మలచుకున్నాయి. ప్రవళిక మృతిని దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేసి నిరుద్యోగ యువతీయువకుల మద్దతును కూడగట్టాయి. అప్పటి అధికార పక్షం, నేటి ప్రతిపక్ష బీఆర్‌ఎస్ సైతం ప్రవళిక మృతిని పెద్దది చేయకుండా ప్రవళిక తల్లిదండ్రులతో మాట్లాడి ప్రవళిక సోదరుడికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం మారడంతో ఆ పార్టీ నాయకులు చేతులు ఎత్తివేశారు. ప్రవళిక మృతి సమయంలో ప్రియాంకగాంధీ దూతగా ఉత్తరప్రదేశ్ ఎంపీ డాలీశర్మ స్వయంగా అక్టోబర్ 15న బిక్కాజిపల్లికి వచ్చి ప్రవళిక తల్లిదండ్రులతో మాట్లాడారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 'ప్రియాంకగాంధీ నీకు తోడుగా ఉంటానని చెప్పమని నన్ను పంపింది'అని డాలీశర్మ ప్రవళిక తల్లి విజయకు చెప్పారు. ఇదే సమయంలో పీసీసీ అధికార ప్రతినిధి, నేటి రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌రియాజ్ స్వయంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో ప్రవళిక తల్లిదండ్రులు లింగయ్య, విజయలతో మాట్లాడించారు. 'పోయిన బిడ్డను తెచ్చి ఇవ్వలేం.. అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి'అని ధైర్యం చెప్పారు. నేడు ఆయనే ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఏడు నెలలు దాటింది. ప్రవళిక కుటుంబం, ముఖ్యమంత్రికి గుర్తుకు రాలేదా అంటూ విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. నాటి నేటి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దూతలుగా వచ్చి మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్‌లు నేడు ప్రవళిక కుటుంబ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఎందుకు తీసుకెళ్లడం లేదని నిరుద్యోగ యువత ప్రశ్నిస్తుంది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు స్పందించి ప్రవళిక సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు కుటుంబానికి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

అసలు ఏం జరిగిందంటే...

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని బిక్కాజిపల్లి గ్రామానికి చెందిన మర్రి ప్రవళిక పోటీ పరీక్షల కోసం హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో కోచింగ్ తీసుకుంటున్న క్రమంలో పోటీ పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో విరక్తి చెందిన ఆమె 2023 అక్టోబర్ 13న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రవళిక మృతితో అక్కడే వివిధ కోచింగ్ సెంటర్‌లలోని నిరుద్యోగ యువతీ యువకులు నిరసనకు దిగారు. అప్రమత్తమైన అప్పటి ప్రభుత్వం ప్రవళిక మృతదేహాన్ని భారీ పోలీసు బందోబస్తు మధ్య స్వగ్రామం బిక్కాజిపల్లి గ్రామానికి తీసుకొచ్చి వందలాది మంది పోలీసుల పహారా మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల సందర్భంలో వేలాది మంది విద్యార్థులు వచ్చి ఆందోళన చేపట్టినా పోలీసులువారిని తోసివేశారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు సైతం వచ్చి ఆందోళన నిర్వహించారు.

కూలీ పనులకు వెళుతున్నా...

నా బిడ్డ చనిపోయి ఎనిమిది నెలలు దాటుతుంది. బిడ్డ చనిపోయినప్పుడు వేలాది మంది రోజు వచ్చిండ్లు. ఆదుకుంటామని ధైర్యం చెప్పిండ్లు. మీటింగ్‌లల్ల నాబిడ్డ పేరు చెప్పని నాయకుడు లేడు. ఎన్నికలు అయిపోయినయి. నన్ను ఎవళ్లూ పట్టిచ్చుకుంటలేరు. చానామంది నాయకుల దగ్గరికి తిరిగిన. కాళ్లు ఏళ్లు మొక్కినా కనికరం లేదు. అప్పుడు ఇప్పుడు అంటున్నరు. బిడ్డ పోయినందుకు కొడుక్కు ఉద్యోగం ఇస్తం అన్నరు. ఇప్పుడు ఎవళూ ఏమీ చెబుతలేరు. రెక్కాడితిగాని డొక్కాడదు. అందుకు రోజు కూలీ పనులకు పోతున్న. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంతరెడ్డి సారు నా కొడిక్కి ఉద్యోగం, నాకు ఆర్థికసహాయం చేసి ఆదుకోవాలే.
- మర్రి లింగయ్య, ప్రవళిక తండ్రి, బిక్కాజిపల్లి

నిందమోపిండ్లు.. రుజువు చేయలే..

నాబిడ్డ చదువులో చాలా తెలివిగలది. ఏనాటికైనా గవర్నమెంట్ ఉద్యోగం సాధిస్తా అన్నది. ఉద్యోగం వచ్చినంకనే పెళ్లి అన్నది. పరీక్షల పేపర్‌లు లీక్ కాంగనే రంది పడ్డది. మళ్ల ఎప్పుడు పెడుతరో.. నౌకరి వస్తదో రాదో అని మదనపడేది. గుండె ధైర్యం చెడి ఆత్మహత్య చేసుకున్నది. చావుకు ప్రేమ కథ అల్లిండ్లు. నింద మోపిండ్లు. ఇప్పటికి రుజువు చేయలే. కడుపు కాలుతుంది. క్షణంక్షణం బిడ్డ యాదికొస్తుంది. ఇప్పుడు మా ఇంటి వంక ఎవ్వలూ చూడటం లేదు. నా బిడ్డ పేరు చెప్పుకుని ఓట్లు సంపాదించుకున్నరు. గద్దెలు ఎక్కిండ్లు. నా బిడ్డ ఇప్పుడు ఎవ్వరికి గుర్తుకు లేదు.
- మర్రి విజయ, ప్రవళిక తల్లి, బిక్కాజిపల్లి

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



కొత్తూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి: ప్రజలందరూ ఆరోగ్యంపై శద్ధ వహించాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సూచించారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో సామాజిక కార్యకర్త కందికట్ల సంతోష్‌కుమార్ నేతృత్వంలో ఏకశిల హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్యశిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. చిన్న సమస్య వచ్చిన అలసత్వం వహించకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచనలు చేశారు. ప్రజలకు ఉచిత వైద్యసేవలను అందించేందుకు కృషి చేసిన సామాజిక కార్యకర్త కందికట్ల సంతోష్‌కుమార్‌కు, ఏకశిల హాస్పిటల్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, మండలపార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, ఔషధాల దాత కోళ్ల నాగరాజు, యాకయ్య, ఎంపీటీసీ రాధమ్మరాజయ్య, నాగరాజు, నాగేశ్వర్ రావు, సుదర్శన్‌రెడ్డి, విజయ్, శ్రీశైలం, రంగారావు, రవి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు



కూలీలతో చర్చిస్తున్న అధికారులు

చెన్నారావుపేట: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సోషల్ ఆడిట్ జిల్లా ఇన్‌చార్జ్ అంజయ్య గౌడ్ అన్నారు. మండలంలోని కల్ నాయక్ తండా, గొల్లపల్లి గ్రామాల్లో 15వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభలను మంగళవారం నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన పనులను గ్రామస్తులతో చర్చించారు. ఈ పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ కొంరయ్య, ఎంపీఓ అంబటి శ్రీధర్ రాజు, ఈసీ కిషోర్ కుమార్, టీఏలు మనోహర్, సురేందర్, సత్యనారాయణ సింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వికాస్, భరత్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పంట రుణాలు ఇవ్వకపోవడం అన్యాయం

- ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కాజీపేట సెంటర్: ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమై రైతులు విత్తనాలు నాటుతున్నా.. ఇంతవరకు ప్రభుత్వం పంట రుణాలు ప్రారంభించకపోవడం, రైతు భరోసా ఇవ్వకపోవడం అన్యాయమని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. మంగళవారం అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేసి, మాట్లాడారు. వ్యవసాయ పనులు ప్రారంభమై నెల కావస్తున్న ప్రభుత్వం సరైన సమగ్ర వ్యవసాయ ప్రణాళిక ప్రకటించలేదన్నారు. పంట రుణాలకు రూ.2లక్షల రుణమాఫీకి ముడిపెట్టి బ్యాంకర్లు రైతులకు కొత్త రుణాలు సైతం ఇవ్వడం లేదని తెలిపారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం జరిపి రుణాలు ఇస్తున్నట్లు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబ బాబూరావు, రాష్ట్ర నాయకుడు నాగేల్లి కొమురయ్య, నర్ర ప్రతాప్, మల్లికార్జున్, సదానందం, సురేందర్, నాగేష్ పాల్గొన్నారు.

నేటి ర్యాలీని విజయవంతం చేయాలి

కాజీపేట సెంటర్ : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నేడు (బుధవారం) మామునూరు నుంచి ఖిలా వరంగల్‌లోని జ్యోతి బా పూలే తెలంగాణ బీసీ బాలుర సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల వరకు నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా సంక్షేమ అధికారి హైమావతి ప్రకటనలో కోరారు. 'సాక్ష్యం స్పష్టంగా ఉంది.. నివారణ పెట్టుబడి' అనే థీమ్‌తో ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే ఈ ర్యాలీలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, యువకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వన మహోత్సవానికి ఏర్పాట్లు

- 25.83లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం



కొండాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వేదవతి(ఫైల్)

నల్లబెల్లి: రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తోంది. గత పాలకులు హరితహారం కార్యక్రమంతో ముందుకుపోగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని నిర్ణయించింది. ఈమేరకు ప్రభుత్వం ఆధ్వర్యంలో జూన్ 27న రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వనమహోత్సవం కార్యక్రమంలో జిల్లాలో 25,83,550మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు అవసరమైన మొక్కలను పంచాయతీ, అటవీ శాఖల నర్సరీల్లో పెంచుతున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా స్థాయిలో అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం వానలు కురుస్తున్న నేపథ్యంలో మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాటు చేయాలని సూచించారు. ఖాళీ స్థలాల గుర్తింపు, కొత్త రోడ్లు, ఆర్ అండ్ బీ, పంచాయతీ, నేషనల్ హైవే రోడ్ల వెంబడి మొక్కలు నాటేలా దృష్టి సారించారు.

అన్ని శాఖల సమన్వయం

'వనమహోత్సవం'లో భాగంగా 323 గ్రామ పంచాయతీల్లో 339నర్సరీలను పంచాయతీ, అటవీ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వీటిలో 25,56,000 మొక్కలను సిద్ధం చేశారు. అవసరమైన మొక్కలు అటవీ శాఖ అధికారులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

శాఖల వారీగా లక్ష్యం నిర్దేశం..

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించారు. పంచాయతీ రాజ్ శాఖకు అత్యధికంగా 7లక్షలు, గ్రామీణాభివృద్ధి శాఖకు 6,14,250, జీడబ్ల్యూఎంసీ 5లక్షలు, నర్సపేట మున్సిపల్‌కు 1,08,500, వ్యవసాయ శాఖకు లక్ష కేటాయించగా, మిగతా శాఖలకు 95వేల నుంచి 500వరకు కేటాయించారు.

వివిధ శాఖల లక్ష్యం..

శాఖ	నాటనున్న మొక్కలు
పంచాయతీ రాజ్	7,00,000
డీఆర్‌డీఓ	6,14,250
పట్టు పరిశ్రమ	80,000
నర్సంపేట మున్సిపాలిటీ	1,08,500
వ్యవసాయ శాఖ	1,00,000
అటవీ	50,000
వర్ధన్నపేట మున్సిపాలిటీ	90,000
ఎక్సైజ్	95,000
ఉద్యాన	82,750
గనులు, భూగర్భ వనరుల	8,400
పశుసంవర్ధకశాఖ	38,400
విద్యా శాఖ	50,000
పౌర సరఫరాలు	5,000
పరిశ్రమలు	6,000
వ్యవసాయ మార్కెటింగ్	3,000
జిల్లా సహకార శాఖ	3,150
మత్స్య శాఖ	1,000
సంక్షేమ శాఖ	3,500
వైద్య ఆరోగ్య శాఖ	2,000
మైనార్టీ సంక్షేమం	500
గిరిజన సంక్షేమం	1,400
బీసీ సంక్షేమం	1,000
ఎస్సీ సంక్షేమం	500
గ్రేటర్ వరంగల్	5,00,000
నీటిపారుదల	39,200
మొత్తం	25,83,550

ఏర్పాట్లు చేస్తున్నాం

నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. వర్షాలు సమృద్ధిగా కురిస్తే జూలైలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 25.83లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే వివిధ శాఖలకు లక్ష్యాన్ని నిర్దేశించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.
– కౌసల్య దేవి, డీఆర్‌డీఓ, వరంగల్

ఆర్థికాభివృద్ధే 'మహిళా శక్తి' ఉద్దేశం

- కలెక్టర్ సత్య శారదా దేవి



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యా శారదాదేవి, పక్కన డీపీఓ ఉషాదయాళ్, తదితరులు

కాజీపేట సెంటర్: జిల్లాలో మహిళా శక్తి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, వారి ఆర్థికాభివృద్ధే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ సత్య శారదాదేవి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో మంగళవారం సెర్ప్, స్త్రీనిధి సిబ్బందికి మహిళా శక్తి కార్యక్రమం అమలుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ పథకంలో గ్రామ సమాఖ్యలోని సంఘాలకు రూ.కోటి వరకు వడ్డీ లేని రుణాలను అందజేయడంతోపాటు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు రూ.5లక్షల వరకు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఈ పథకంలో జిల్లాలో 2024– 25 సంవత్సరానికి 9,013 మంది మహిళా సంఘాల సభ్యులకు రూ.93.80కోట్ల విలువ గల కార్యాచరణ ప్రణాళికను చేపట్టడం జరుగుతుందని, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, పర్మనెంట్ స్టిచింగ్ సెంటర్లు, పాడి గేదెల పెంపకం, మొబైల్ ఫిష్ అవుట్ లెట్, పాల డెయిరీల ప్రోత్సాహం, మీసేవ కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యవసాయ అనుబంధ పరికరాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లు ఇందులో భాగమని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలి

కాజీపేట సెంటర్ : పూర్వ ప్రాథమిక కేంద్రాలుగా అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఆదేశించారు. అంగన్‌వాడీల అభివృద్ధి, పిల్లల్లో పోషక లోపం నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికను జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన చర్యలు, పిల్లల్లో పోషక లోపం నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను వాకాటి కరుణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జూలైలో పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. కలెక్టర్ సత్య శారదాదేవి మాట్లాడుతూ.. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంజూరైన సివిల్, పెండింగ్ పనులపై పూర్తి నివేదికలను రెండు రోజుల్లో సమర్పించాలని సంబంధిత అధికారులను అదేశించారు.

రైతుల అభ్యున్నతికే రైతు నేస్తం

రాయపర్తి(వర్ధన్నపేట): రైతుల అభ్యున్నతికోసమే రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. హైదరాబాద్ నుంచి మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్ధన్నపేట పట్టణకేంద్రంలోని రైతు వేదికలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి కలెక్టర్ సత్యశారద ఈ వీసీలో మాట్లాడారు. రైతునేస్తం కార్యక్రమాన్ని అన్నదాతలు వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఆవిష్కరణలు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంకోసం ప్రతి మంగళవారం, శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విస్తరణాధికారులు, రైతులతో రైతు నేస్తం పేరిట రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యసాయానికి సాంకేతికతను అనుసంధానం చేస్తూ రైతు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనేది ఈ కార్యక్రమ ఉద్దేశమని చెప్పారు. రైతులు వ్యవసాయరంగంతోపాటు చేపలు, పాడిపశువుల పెంపకం వంటివి చేపట్టాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందేలా రైతులు నూతన వ్యవసాయ విధానాలు అవలంభించాలని తెలిపారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, అదనపు డీఆర్‌డీఓ రేణుక, జిల్లా పరిశ్రమల అధికారి నర్సింహమూర్తి, ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ మధుసూదన్‌రావు, ఈడీ ఎం రాజ్‌కుమార్ జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, డీపీఓ ఉషాదయాళ్ పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెటింగ్ డీఈ ఎల్లేశ్



డీఈకి సమస్యలు వివరిస్తున్న చైర్మన్ హరీశ్‌రెడ్డి

నెక్కొండ: వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెటింగ్ డీఈ ఎల్లేశ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మార్కెట్‌ను సందర్శించారు. మార్కెట్‌లో కనీస సౌకర్యాల కల్పన మరమ్మతులను పరిశీలించారు. మార్కెట్ ప్రధాన రహదారి వెంట నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, ప్రధాన గేటు వద్ద మరమ్మతు పనులు చేపట్టాలని మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి డీఈకి తెలిపారు. యార్డు ప్రాంగణంలో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టడానికి నూతన ప్లాట్‌ఫారాలను ఏర్పాటు చేయాలని, రైతుల విశ్రాంతి భవన నిర్మాణం, మార్కెట్ యార్డ్ ప్రధాన కార్యాలయంలో ఆధునికీకరణ పనులు, పాత గోదాం మరమ్మతులు చేపట్టాలని హరీశ్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి కృష్ణమీనన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థినులకు హాస్టల్ వసతి


మహేశ్‌బాబు

హన్మకొండ కల్చరల్ : హాస్టల్ వసతి కోసం ఆర్యవైశ్య విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని వాసవి ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ గట్టు మహేశ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో వాసవి ఆర్య వైశ్య హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా ఆధ్వర్యంలో నిర్మించిన వసతి గృహంలో ప్రవేశాలు జూలై ఒకటో తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. హాస్టల్‌లో ప్రవేశాల కోసం డిగ్రీ, పీజీ చదివే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అర్హులైన వైశ్య ప్రతిభావంతులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులను ఎంపిక చేసి ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 80998 39966, 83417 85462 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మామను చంపిన అల్లుడికి జీవిత ఖైదు

- తీర్పు వెలువరించిన జడ్జి బి.అపర్ణాదేవి



వరంగల్ లీగల్: మామను చంపిన అల్లుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి బి.అపర్ణాదేవి మంగళవారం తీర్పు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హసన్‌పర్తికి చెందిన వెంకటేష్‌కు 2013లో కంఠాత్మకూర్‌కు చెందిన జెక్కి ఎల్లయ్య కూతురు స్వాతితో వివాహం జరిగింది. హనుమకొండ చౌరస్తాలో ఓ మెడికల్ షాపులో గుమస్తాగా పనిచేసే వెంకటేష్.. భార్యతో నిత్యం గొడవ పడే వాడు. దీనిపై పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. పెద్దలు సర్దుబాటు చేసి పంపించినా వెంకటేష్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. ఈ క్రమంలో 2020, అక్టోబర్ 06న ఎల్లయ్య తన కూతురు ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం తన ఇంటికి ప్రయాణయ్యాడు. ఈ క్రమంలో వెంకటేష్.. తన మామ ఎల్లయ్యకు ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావని అడుగగా హసన్‌పర్తి సమీపంలోని నల్లగుట్ట వద్ద ఉన్నానని తెలిపాడు. మామ వద్దకు చేరుకున్న అనంతరం ఇద్దరూ మద్యం సేవించారు. సాయంత్రం కల్లు కోసం హసన్‌పర్తి చెరువు వద్ద ఉన్న తాటివనానికి వెళ్లారు. అక్కడ వెంకటేష్, స్వాతి (దంపతులు) సమస్యపై ఎల్లయ్య మాట్లాడుతూ 'నా కూతురును ఇబ్బంది పెట్టకు.. మంచిగా చూసుకో' అని తెలుపగా కోపోద్రిక్తుడైన వెంకటేష్ మామపై దురుసుగా ప్రవర్తించాడు. దీంతో తన బైక్ వెంట తెచ్చుకున్న గొడ్డలితో ఎల్లయ్య తన అల్లుడిపై దాడికి యత్నించాడు. అప్రమత్తమైన వెంకటేష్.. అదే గొడ్డలితో ఎల్లయ్యను కొట్టగా తీవ్ర రక్తస్రావం జరిగి స్పృహ తప్పాడు. దీంతో మామను చెరువులో పడేశాడు. మృతి చెందాడనుకుని నిర్ధారించుకున్న అనంతరం ఆత్మహత్యగా చిత్రీకరించాలని ఉద్దేశంతో తన మామ బైక్‌కు దాడికి ఉపయోగించిన గొడ్డలిని తగిలించి చెరువులో పడేశాడు. అనంతరం ఏమి తెలియనట్లు ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో చెల్లి ఇంటికి వెళ్లిన తండ్రి తిరిగి రాకపోవడంతో ఎల్లయ్య కుమారుడు నాగరాజు హసన్‌పర్తి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. 2020, అక్టోబర్ 09వ తేదీన ఉదయం చెరువులో మృతదేహం తేలిందని పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న నాగరాజు ఎంజీఎం మార్చురీకి వెళ్లి అది తన తండ్రి శవంగా గుర్తించాడు. తన తండ్రి మృతిపై అనుమానం ఉందని పోలీసులకు తెలిపాడు. పోలీసులు విచారణ చేస్తున్న క్రమంలో ఎలాగైనా తనను అరెస్ట్ చేస్తారని భావించిన వెంకటేష్.. తన బంధువుల ద్వారా పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నేరం రుజువు కావడంతో నేరస్తుడు పోతరాజు వెంకటేష్‌కు జీవిత ఖైదు, రూ.2 వేల జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణాదేవి తీర్పు వెల్లడించారు. ఈ కేసును సీఐలు జె.సురేశ్, కె.శ్రీధర్‌రావు, ఎస్సై రాజ్‌కుమార్, పరిశోధించారు. హెడ్‌కానిస్టేబుల్ వి.రవీందర్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా ప్రాసిక్యూషన్ పక్షాన పీపీ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

సెటిల్‌మెంట్స్ కేరాఫ్ పైడిపల్లి

- స్థానికేతరులపై జులుం.. డబ్బులు డిమాండ్
- ప్రతీ పంచాయితీలో జోక్యం.. రాత్రి వేళల్లో వార్నింగ్‌లు
- ఫిర్యాదు చేసినా.. పోలీసుల ఉదాసీనత



వరంగల్: విప్లవకారుల పురిటిగడ్డగా పేరున్న పైడిపల్లి గ్రామం ప్రస్తుతం సెటిల్‌మెంట్లకు కేరాఫ్‌గా మారింది. గ్రేటర్ వరంగల్ పరిధి 3వ డివిజన్‌లో కొద్దికాలంగా సెటిల్‌మెంట్ల పేరిట గ్యాంగులు ఏర్పడి హల్‌చల్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావడంతో పైడిపల్లి, ఆరెపల్లి, కొత్తపేట గ్రామాల పరిధి భూములకు డిమాండ్ పెరిగింది. దశాబ్దాల కిందట వందల రూపాయల్లో కొన్న భూములు ప్రస్తుతం వేలల్లో ధర పలుకుతుండడంతో పైడిపల్లిలోని కొంత మంది యువకులు గ్యాంగ్‌లుగా ఏర్పడి సెటిల్‌మెంట్ల దందా సాగిస్తున్నారు. పైడిపల్లిలో ఒకరు భూమి కొనుగోలు చేస్తే అందుకు సంబంధించిన వారసులను వెతికి తీసుకొచ్చి అడ్డుపెడుతూ పంచాయితీలు చేస్తున్నారు. కొనుగోలు చేసి వారి దగ్గర్నుంచి గుడ్‌విల్ తీసుకుంటూ దందాను మూడు పువ్వులు.. ఆరుకాయలుగా సాగిస్తున్నారు. ఒక్కో పంచాయితీకి ఒక్కో రేటు.. భూమి పంచాయితీ అయితే.. మార్కెట్ వాల్యూ ప్రకారం పర్సంటేజీలు తీసుకుంటున్నారు. అదే వివాదాస్పద భూమి అయితే ముందుగా గుడ్‌విల్ మాట్లాడుకుని అడ్వాన్స్ ఇస్తే రంగంలోకి దిగి వ్యతిరేక గ్రూపుల వారిని పిలిపించి సెటిల్‌మెంట్ చేస్తున్నారు. సెటిల్‌మెంట్‌కు వచ్చిన వారిని బెదిరింపులకు గురి చేస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఒప్పుకుంటున్నట్లు తెలుస్తోంది.

కొన్ని ఘటనలు..

- మేడారం జాతర సమయంలో ఇదే గ్యాంగ్ ఆరెపల్లి వైన్స్ ఓనర్‌ను బెదిరించి ఫుల్ బాటిల్స్ తీసుకున్నారు. తాము లోకల్ లీడర్స్‌మని, పేరు చెప్పి తమ పోరగాళ్లను పంపిస్తే బాటిళ్లు ఇవ్వకపోతే మీషాపు ముందు మా పోరగాళ్లు లొల్లి చేస్తారని హెచ్చరించినట్లు తెలిసింది.
- 20ఏళ్ల క్రితం ఒక వివాహేతర సంబంధం పంచాయితీలో అప్పటి పెద్దమనుషులు అతడి నుంచి సదరు అమ్మాయికి డబ్బులిప్పించారు. తాజాగా ఈసెటిల్‌మెంట్ గ్యాంగ్ అప్పటి బాధితురాలు కూతుర్ని రంగంలోకి దింపి ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించడంతో సదరు వ్యక్తిని హైదరాబాద్ నుంచి పిలిపించి రూ.4లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. అతడి నుంచి తీసుకున్న రూ.4లక్షల్లో అమ్మాయికి రూ.2 లక్షలు ఇచ్చి మిగతా రెండు లక్షలు ఈ బ్యాచ్ నొక్కేశారు. విషయం తెలుసుకున్న బాధితురాలు అదే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఈ సెటిల్మెంట్ బ్యాచ్‌పై ఫిర్యాదు చేసింది. కానీ ఇప్పటి వరకు ఆమెకు న్యాయం జరగలేదని తెలిసింది.
- భూపాలపల్లికి చెందిన ఒక రిటైర్డ్ ఉద్యోగి ఆరెపల్లిలో ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నాడు. అదే ఆరెపల్లిలో అద్దెకు ఉంటున్న అతడి స్నేహితుడికి రిటైర్డ్ ఉద్యోగి ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో గొడవ జరిగింది. సదరు రిటైర్డ్ ఉద్యోగి ఈ సెటిల్‌మెంట్ బ్యాచ్‌ను కలిసి తన స్నేహితుడి దగ్గరి నుంచి డబ్బులు రావాలి.. ఇవ్వడం లేదని చెప్పాడు. వెంటనే వీరు రంగంలోకి దిగి స్నేహితుడి ఇంటికెళ్లి అతడి భార్య ఎదుట నానా బూతులు మాట్లాడి పంచాయితీ పెట్టి రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ.లక్ష వసూలు చేశారు. అంతే కాకుండా ఎదుటి వ్యక్తి నుంచి రూ.50 వేలు వసూలు చేసినట్లు సమాచారం.
- తాజాగా సోమవారం రాత్రి ఆరెపల్లిలోని ఒక వ్యక్తికి ఈసెటిల్‌మెంట్ బ్యాచ్ ఫోన్ చేసి నీ అంతుచుస్తామని బెదిరించినట్లు తెలిసింది.
- నెల క్రితం వంగపహాడ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద పంచాయితీ పెట్టి ఒకరి నుంచి అన్యాయంగా రూ.40వేలు వసూలు చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈవిషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు బాధితుడు జంకుతున్నాడు. ఇవే కాకుండా చిన్నా చితక పంచాయితీలు వారంలో ఒక్కటైనా ఈగ్యాంగ్ చేస్తోందన్న ప్రచారం పైడిపల్లిలో జరుగుతోంది.

డీన్ అపాయింట్ డిలే!

- సర్వీస్ సీనియార్టీనా? ప్రొఫెసర్ సీనియార్టీనా?
- ఇద్దరు ప్రొఫెసర్లలో సీనియార్టీపై వివాదం
- కమిటీ వేసే యోచనలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి


కేయూలో సైన్స్‌తోపాటు వివిధ విభాగాల డీన్స్ కార్యాలయం..

కేయూ క్యాంపస్: కేయూ సైన్స్ డీన్ నియామకంలో యూనివర్సిటీ అధికారులు జాప్యం చేస్తున్నారు. సైన్స్ డీన్‌గా కొనసాగుతున్న గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్, ప్రస్తుత కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి సైన్స్ డీన్ పదవీకాలం గత నెల 31న ముగిసింది. 21 రోజులు గడిచినా.. మరో ప్రొఫెసర్‌ను డీన్‌గా నియమించలేదు. సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ వైవాలు, సెమినార్ల నిర్వహణ బాధ్యతలతోపాటుగా కీలకమైన సెనెట్‌లోనూ, స్టాండింగ్ కమిటీలోని సభ్యుడిగా కూడా డీన్ కొనసాగుతారు. అలాంటి కీలకమైన పదవి నియామకంలో జాప్యం జరగడం యూనివర్సిటీలోని ప్రొఫెసర్లలో చర్చనీయాంశంగా మారింది.

ఇద్దరిలో ఎవరిని నియమించాలి?

డీన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ మల్లారెడ్డి తర్వాత సైన్స్ విభాగాల్లో ఎవరు సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్నారో ఆ ప్రొఫెసర్‌ను డీన్‌గా నియమించాల్సి ఉంటుంది. అయితే కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్ జి.హనుమంతు, ఫిజిక్స్ విభాగంలో ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి ఉన్నారు. వీరిలో ఎవరో ఒకరిని నియమించాలి. వీరిలో ఎవరిని నియమిస్తారనేది ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది. మొదట సర్వీస్‌లో జాయిన్ అయినప్పటి నుంచి సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలా? లేక పదోన్నతి పొందినప్పటి నుంచి సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలా? అనే విషయంలో సందిగ్ధత నెలకొంది. కాగా.. గతంలో ఈ రెండు విధానాలనూ అనుసరించడంతో ప్రస్తుతం ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి. రెండేళ్ల క్రితం అప్పటి వీసీ తాటికొండ రమేశ్ సర్వీస్‌లో మొదట జాయిన్ అయిన అంశాన్ని సీనియార్టీగా కాకుండా ప్రొఫెసర్‌గా నియమితులైన తర్వాత సీనియార్టీని పరిగణనలోకి తీసుకొని సైన్స్ డీన్‌గా గణిత శాస్త్ర విభాగం ఆచార్య పి.మల్లారెడ్డిని నియమించారు.

కమిటీ వేయాలని యోచన!

కాగా.. కాకతీయ యూనివర్సిటీలో ఇప్పటికీ రెండు విధానాలను అనుసరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సర్వీస్ సీనియార్టీని, మరికొన్ని సందర్భాల్లో ప్రొఫెసర్ అయిన వారి సీనియార్టీని డీన్‌లుగా నియమించినట్లు తెలుస్తోంది. కేయూ సైన్స్ డీన్‌గా ఎవరిని నియమించాలో తేల్చుకోలేకపోతున్న కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఈ విషయాన్ని కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం సైన్స్ డీన్‌గా ఎవరిని నియమించాలనే విషయంపై ఓ కమిటీ వేయాలనే యోచనలో రిజిస్ట్రార్ ఉన్నట్లు సమాచారం. ఆఇద్దరు ప్రొఫెసర్లలో ఒకరిని నియమించేవరకు రిజిస్ట్రార్ మల్లారెడ్డినే సైన్స్ డీన్‌గా అంటిల్‌ఫర్‌దర్ ఆర్డర్‌పై కొనసాగిస్తున్నారు. అయితే కమిటీలో ఉండాలని ఇద్దరు ముగ్గురిని సంప్రదించినా ఎవరూ ముందుకు రావడం లేదని సమాచారం.

యూనివర్సిటీ యాక్ట్‌లో ఏముందంటే..

యూనివర్సిటీ యాక్ట్ ప్రకారం.. డీన్ అయ్యేవారు ప్రొఫెసర్ అయి ఉండాలని రొటేషన్ ప్రకారం అని మాత్రమే ఉందని తెలుస్తోంది. డీన్‌ల నియామాకంలో యూనివర్సిటీ యాక్ట్‌లో నిర్దిష్టమైన విధానం లేకపోవడం వల్ల వీసీలుగా బాధ్యతలను నిర్వర్తించినవారు తమ విచక్షణతోనే ఒక విధానం అంటూ కాకుండా.. రెండు విధానాలు అనుసరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇన్‌చార్జ్ వీసీగా వాకటి కరుణ ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్ట్

- రూ.1.32 లక్షల విలువైన రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

ఖిలా వరంగల్: తాళం వేసి ఊరెళ్లిన ఓ వ్యక్తి ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి, అతని నుంచి రూ.1.32 లక్షల విలువైన రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. వరంగల్ పుప్పాలగుట్టలో మాటేడి రాజదినాకర్ ఈనెల 10న ఇంటికి తాళం వేసి వ్యక్తిగత పనిమీద హైదరాబాద్‌కు వెళ్లాడు. 12వ తేదీన ఉదయం పనిమనిషి ఆ ఇంటికి వచ్చి చూడగా తాళం పగుల గొట్టి ఉంది. దాంతో ఆమె సమాచారం మేరకు రాజదినాకర్ వరంగల్‌కు చేరుకుని రూ.23వేల నగదు, మూడు గ్రాముల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోను చోరీకి గురైనట్లు గుర్తించి మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో మంగళవారం మధ్యాహ్నం వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న భద్రాచలం జిల్లా పైడిగూడెం గ్రామానికి చెందిన కనితి వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

సంకటహర చతుర్థి పూజలు



హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయంలో జ్యేష్ఠ బహుళ చవితి సంకటహర చతుర్థిని పురస్కరించుకుని గణపతికి ప్రత్యేక పూజలు జరిపారు. మంగళవారం సాయంత్రం ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రణవ్ దేవాలయంలోని మూల మహాగణపతికి క్షీరాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో, హరిద్రా కుంకుమ గంధోదక విలేపనాలతో అభిషేకం నిర్వహించి గరిక పూజ చేసి నీరాజన మంత్రపుష్పం జరిపారు.

రూ.12 లక్షలు తీసుకున్న వ్యక్తిపై కేసు

ఖిలా వరంగల్: నర్సరీ పేరుతో ఓ వ్యక్తి వద్ద రూ.12 లక్షల తీసుకుని మొఖం చాటేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నర్సంపేటకు చెందిన మద్దెల రమేష్ నర్సరీ వ్యాపారం కోసం శంభునిపేటకు చెందిన వాహిద్ అలీనుంచి రూ.12లక్షల నగదు తీసుకున్నారు. తిరిగి చెల్లించాలని అడిగితే మొఖం చాటేశాడు. మోసం చేశాడని గ్రహించి మంగళవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో వాహిద్ అలీ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

విధుల్లో అలసత్వం వహించొద్దు


పీఎస్ఓ సిబ్బందితో అదనపు డీసీపీ సురేశ్‌కుమార్

- అదనపు డీసీపీ సురేశ్ కుమార్

వరంగల్ క్రైం: వ్యక్తిగత భద్రతా సిబ్బంది విధుల్లో అలసత్వం వహించొద్దని, నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని అదనపు డీసీపీ సురేశ్‌కుమార్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన వ్యక్తిగత భద్రతా సిబ్బందికి మంగళవారం కమిషనరేట్‌లో ఒక రోజు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పర్సనల్ సెక్యూరిటీ వింగ్ ఇన్‌చార్జి, డీఎస్పీ నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ తరగతుల్లో వ్యక్తిగత భద్రతా సిబ్బందితో పాటు బాంబు నిర్వీర్యం విభాగం నిర్వహించాల్సిన విధులు, పీఎస్ఓ భద్రత కల్పిస్తున్న వ్యక్తులను శత్రువుల నుంచి సురక్షితంగా రక్షించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ భద్రతా సిబ్బంది ముఖ్యంగా వీఐపీలకు భద్రత కల్పిస్తున్న సమయంలో అనుక్షణం పరిసరాలను పరిశీలించడంతో పాటు, వేగంగా అనుమానాస్పద వ్యక్తులను గుర్తించాల్సి ఉంటుందని తెలిపారు. వీటితో పాటు భద్రతా సిబ్బంది అన్ని రకాల ఆయుధాలు వినియోగించడంలో నిష్ణాతులైన ఉండాలని, దేహదారుఢ్యం, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. ఆరోగ్య పరిరక్షణకు భద్రతా సిబ్బంది నిరంతరం యోగా లేదా శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు, ఆర్ఐలు స్వర్ప రాజ్, శ్రీనివాస్, శ్రీధర్, పోలీస్ సంఘం అధ్యక్షుడు శోభన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు, కూకట్‌పల్లికి ఏసీ బస్సులు

- శ్రీశైలానికి సూపర్ లగ్జరీ
- ఆర్టీసీ వరంగల్–1 డీఎం మోహన్ రావు



హన్మకొండ: హనుమకొండ నుంచి గుంటూరు, హైదరాబాద్ కూకట్‌పల్లికి అదనంగా ఏసీ రాజధాని బస్సు నడుపుతున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు తెలిపారు. అదే విధంగా శ్రీశైలానికి అదనంగా సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నామన్నారు. బుధవారం నుంచి ఈ బస్సులు ప్రయాణికుల సేవల్లోకి రానున్నాయన్నారు. హనుమకొండ నుంచి గుంటూరుకు రోజూ ఉదయం 7 గంటలకు, సాయంత్రం 6.30 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. గుంటూరు నుంచి హనుమకొండకు ఉదయం 7 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు బస్సు బయలుదేరుతుందని వివరించారు. హనుమకొండ నుంచి కూకట్‌పల్లికి రోజూ ఉదయం 5.30, సాయంత్రం 4.15 గంటలకు, కూకట్‌పల్లి నుంచి హనుమకొండకు ఉదయం 5 గంటలకు, 10 గంటలకు రాజధాని బస్సు బయలుదేరుతుందన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్యాటకులు, భక్తుల సౌకర్యార్థం హనుమకొండ నుంచి శ్రీశైలానికి ఉదయం 7 గంటలకు, 10.30 గంటలకు, శ్రీశైలం నుంచి హనుమకొండకు ఉదయం 7.40 గంటలకు, 8 గంటలకు కొత్త సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. భక్తులు, పర్యాటకులు, ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం.. సుఖవంతమన్నారు. క్షేమంగా గమ్యస్థానాలకు చేరుస్తామన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షల ముఠా అరెస్ట్

- గర్భస్రావాలకు పాల్పడుతున్న దుండగులు
- వివరాలు వెల్లడించిన హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి గర్భస్రావాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ పీఎస్‌లో నిర్వహించిన సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు. నిందితులు కాజీపేట కడిపికొండకు చెందిన బస్కె స్రవంతి, ములుగు జిల్లా పత్తిపల్లికి చెందిన కాసిరాజు దిలీప్, హనుమకొండ కుమార్‌పల్లికి చెందిన జంగా రజమని, వరంగల్ కాశిబుగ్గకు చెందిన ఏకుల నరేశ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ప్రధాన నిందితురాలు బస్కె స్రవంతి గతంలో హనుమకొండలో ఓ ఆసుపత్రిలో నర్సుగా పనిచేసేది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం మరో నిందితురాలు రాజమని తన సమీప బంధువుకు లింగనిర్ధారణ పరీక్షలు చేయాల్సిందిగా స్రవంతిని కోరింది. దీంతో ఆమె హనుమకొండలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న మరో నిందితుడు కాసిరాజు దిలీప్ సహకారంతో హనుమకొండ వేయిస్తంభాల గుడి ప్రాంతంలో సదరు బాధిత మహిళకు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాడు. ఇందులో బాలికని నిర్ధారణ కావడంతో సదరు మహిళకు గర్భస్రావం చేయించాల్సిందిగా రాజమణి.. స్రవంతిని కోరింది. దీంతో కాశిబుగ్గలోని ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న మరో నిందితుడు నరేశ్ వద్ద నుంచి గర్భస్రావం అయ్యేందుకు టాబ్లెట్ ఇచ్చారు. ఈ టాబ్లెట్ వేసుకున్న బాధిత మహిళకు ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స అందించడానికి హనుమకొండలోని ఓ ఆసుపత్రిలో చేర్పించి అక్కడి నుంచి రాజమణి.. స్రవంతి తప్పించుకున్నారు. బాధిత మహిళ ఈ విషయం డాక్టర్‌కు తెలపడంతో సదరు డాక్టర్.. జిల్లా వైద్యాధికారికి సమాచారం ఇచ్చారు. వైద్యాధికారుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి గర్భస్రావాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి స్కానింగ్ మిషన్, ద్విచక్రవాహనం, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ ముఠాలోని ప్రధాన నిందితురాలు స్రవంతి గతంలోనూ ఇదే తరహాలో గర్భస్రావానికి పాల్పడంతో ఆమెపై ఐదు కేసులు నమోదు చేసి జైలుకు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ సీఐ సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

కూలి పనికి వచ్చి మృత్యుఒడికి ..

- విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి
- ముగ్గురికి గాయాలు.. పాంనూర్‌లో ఘటన
- అధికారుల నిర్లక్ష్యమే కారణం : మృతుడి బంధువుల ఆరోపణ


రోదిస్తున్న మృతుడి భార్య, బంధువులు
సోమన్న మృతదేహం

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యుత్ తీగలు లాగే కూలి పనికి వచ్చిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం మండలంలోని పాంనూర్‌లో జరిగింది. మృతుడి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. పాంనూర్‌లో గత నెలలో ఈదురుగాలులతో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో మరమ్మతుల్లో భాగంగా అధికారుల విద్యుత్ తీగలు లాగే పనులు చేయిస్తున్నారు. ఈ పనులకు పాలకుర్తి మండలం కొండాపూర్ శివారు హనుమాన్‌తండాకు చెందిన బానోత్ సోమన్న(30)తోపాటు మరో నలుగురు కూలీలు వచ్చారు. అయితే సంబంధిత అధికారులు ఎల్‌సీ తీసుకోకుండానే పనులు చేయించారు. గ్రామంలో ఉండే ఎల్‌సీ ఫ్యూజ్ సెట్ (ట్రాన్స్‌ఫార్మర్ జంపర్) కట్ చేసి పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ తీగలు లాగుతుండగా సోమన్నతో పాటు మరో ముగ్గురు లావుడ్య రమేశ్, బానోత్ సుమన్, దండిగ సింహాద్రికి షాక్ కొట్టింది. దీంతో వారు గాయపడగా వెంటనే చికిత్స నిమిత్తం ఘన్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే సోమన్న అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య పార్వతి, ఐదేళ్లు, ఎనిమిది నెలల వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మృతుడి బంధువుల నిరసన..

విద్యుదాఘాతంతో సోమన్న మృతిచెందిన సమాచారం తెలుసుకున్న మృతుడి భార్య, బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని, వారిపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. దీనిపై సమాచారం అందుకున్న ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ ముస్క రాజు, ఎస్సై నాగరాజు ఘటనాస్థలికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చచెప్పారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గూడ్స్ ఆటోను ఢీకొన్న కారు

- గూడ్స్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి
- కాచికల్ శివారులో ఘటన


సుధాకర్‌రెడ్డి మృతదేహం

నెల్లికుదురు: గూడ్స్ ఆటోను ఓ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గూడ్స్ ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కాచికల్ శివారు ఇటుకల బట్టీల సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం.. తొర్రూరు మండలం చర్లపాలెం గ్రామానికి చెందిన హనుమాండ్ల సుధాకర్‌రెడ్డి (45) తొర్రూరు మండల కేంద్రంలోని అమృత బ్రెడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తన సొంత గూడ్స్ ఆటోలో బ్రెడ్ ప్యాకెట్లను నెల్లికుదురు, తొర్రూరు మండలాల్లో సప్లై చేస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం తొర్రూరు నుంచి బ్రెడ్ ప్యాకెట్లతో బయలుదేరి నెల్లికుదురు వైపునకు వస్తున్నాడు. కాచికల్ శివారు ఇటుకల బట్టీల సమీపంలో కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం గోల్యా తండాకు చెందిన మాలోతు వెంకటేశ్ కారును అజాగ్రత్తగా నడుపుతూ గూడ్స్ ఆటోను వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో గూడ్స్ ఆటో పల్టీకొట్టి రోడ్డు పక్కనున్న పొలంలో పడింది. ఈ ప్రమాదంలో సుధాకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ వెంకటేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కాంత్రికిరణ్ వివరించారు.

నిందితులు కుటుంబ సభ్యులేనా..?

- మహిళ హత్య కేసులో అడ్డం తిరిగిన కథ
- ఏసీపీ విచారణలో వెలుగు చూసిన నిజాలు


మంజుల(ఫైల్)

వరంగల్ క్రైం: హనుమకొండలోని సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధి రెవెన్యూ కాలనీ, నాగేంద్రనగర్‌లో ఈనెల 21న రాత్రి మక్కల మంజుల (36)హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటన ఆ కాలనీలో పెద్ద సంచలనం సృష్టించింది. అదే కాలనీలో ఉంటున్న వక్కల వెంకటస్వామి తమ తల్లిని హత్య చేసి, తమను కూడా చంపుతానని బెదిరించినట్లు మృతురాలి కూతురు, కొడుకు పోలీసులు ఎదుట వాంగ్మూలం ఇవ్వడంతో ఆ దిశగా విచారణ ప్రారంభించారు. హత్య విషయం వెలుగు చూడటం, వెంకటస్వామిపై అనుమానాలు రావడంతో అతను పరారయ్యాడు. దీంతో పోలీసులకు అనుమానం మరింత పెరిగింది. మృతురాలికి సంబంధించిన కుటుంబ తగదాలు, ఆమె ఆ కాలనీలో ఉంటున్న నేపథ్యం అన్ని కలిసి వెంకటస్వామిని నిందితునిగా చిత్రీకరించాయి. దీంతో పోలీసులు అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకుని వెంకటస్వామిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. పోలీసుల విచారణలో అసలు నిజాలు బయటకు రావడంతో పోలీసులు అవాక్కైనట్లు సమాచారం.

ఏసీపీ విచారణలో వెలుగు చూసిన నిజాలు..

వెంకటస్వామి విచారణలో చెప్పిన మాటలకు, మృతురాలి కుటుంబ సభ్యులు చెబుతున్న విషయాలకు ఎక్కడా పొంతన కలవకపోవడంతో హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డికి అనుమానం వచ్చినట్లు తెలిసింది. దీంతో ఈ కేసుతో సంబంధం ఉన్న అందరినీ కలిపి విచారించి, మరోసారి ఒక్కొక్కరిని విచారించడంతో దృశ్యం సినిమా మాదిరిగా కథ వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. మృతురాలి ప్రవర్తన నచ్చక కుటుంబ సభ్యులే ఆమెను హత్య చేసి.. దానిని వెంకటస్వామిపై మోపినట్లు తెలిసింది. పోలీసుల విచారణ క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా జరగడంతో హత్య చేసిన నిందితులు దొరికిపోయారు. దీంతో హత్యతో సంబంధం లేని సదరు వ్యక్తిని పోలీసులు రక్షించినట్లు తెలిసింది.